# కుతూహలం

సిన్సియర్‌గా పని చేస్తూ, ఒక్క రోజైనా లీవ్ తీసుకోవడానికి ఇష్టపడని వ్యక్తి వరుసగా నాల్రోజులు డ్యూటీకి రాలేకపోతే...

"ఎప్పుడూ లీవ్ తీసుకోని వాడు నాలుగు రోజులనుంచీ రావట్లేదంటే - కొంపదీసి జరక్కూడనిది ఏదైనా జరగలేదు కదా ! అతడి పక్కింటి పాపారావుని అడగాలి - ఏమైందో?"

- అనుకోవడంలో ఆ వ్యక్తి పట్ల కన్సర్న్, ఆదుర్దా వ్యక్తమైతే...

"ఆ - జరక్కూడనిది 'ఏదో' జరిగే ఉంటుంది! లేకపోతే ఎప్పుడైనా లీవ్ పెట్టేవాడా- ఏమన్నానా? వాడి ఎదురింటి వెంకట్రావుని అడిగి తెలుసుకోవాలి - అసలేమైందో?"

- అనుకోవడంలో ఆ వ్యక్తి పట్ల అవాంఛనీయమైన 'కుతూహలం' స్పష్టమౌతుంది!

ఎదుటివాడి క్షేమసమాచారం విషయంలో ఆదుర్దా పడటం మానవత్వమనిపించు కుంటే - అతి కుతూహలంతో ఎదుటివాడి 'కూపీ'లు లాగి - మసాలా జోడించి - దుష్ప్రచారం చేసి - హింసించడం దానవత్వమనిపించుకుంటుంది !

కుతూహలాన్ని ఆపుకోలేని కొందరు ఇతరులకు వచ్చిన ఉత్తరాల్ని గుట్టు చప్పుడుకాకుండా మాయంచేసి - ఎక్కడో ఎవరూ గమనించని చోట తీరిగ్గా చదివేసి - ఆనక చించి పోగులు పెట్టి చెత్త బుట్టలో పడేస్తుంటారు ! సదరు చిరునామాదారుడికి చేరాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని అతనికి చేరుకుండా చేయడమే కాక - నలుగురితో అతడి వ్యక్తిగత విషయాల్ని కథలు కథలుగా చెప్తూ తమ వక్రబుద్ధి చూపెట్టుకుంటారు!

మనిషిలోని కుతూహలమే మనిషి బలహీనతగా మారినప్పుడు - పత్రికల్లో ఎక్కడ చూసినా 'గాసిప్పే' దర్శనమిస్తాయి!

**పైసా ఖర్చులేకుండా - పది నిమిషాల్లో - ప్రజల నాలుకలమీదుగా ప్రపంచాన్నంతా చుట్టి వచ్చే ప్రచార సాధనం - గాసిప్స్!**

మొన్న 'రేఖ ప్రేమాయణం' - ఒక వార్త!

నిన్న 'డయానా విడాకులు' - ఒక వార్త!

నేడు 'ప్రియాంక పెళ్ళి' - ఒక వార్త!

ఒకరి ఆంతరంగిక విషయాల్ని తాటికాయలంతేసి అక్షరాలతో పత్రికల్లో ప్రకటిం చడం - ప్రజలు దాన్ని లొట్టలేస్తూ చదవడం చూసినపుడు - విజ్ఞులైన పాఠకుల మనసు కలుక్కుమంటుంది - కకావికలమై పోతుంది !

**మనిషిలోని కుతూహలం... మనిషి 'జిజ్ఞాస'కి జీవం పోసి - మరిన్ని క్రొంగొత్త విషయాలను తెలుసుకునేలా చేయాలే తప్ప ఆదో రుగ్మతగా మారకూడదు !**

ఏదేమైనా అజ్ఞానాన్ని రూపుమాపుకునే దిశలో - తెలియని విషయాల్ని తెలుసుకోడానికి 'కుతూహలం' ప్రదర్శిస్తే తప్పులేదు గాని - ఒకరి వ్యక్తిగత విషయాలను తెలుసుకోవడానికి మనం 'ఉబలాటపడటం' - క్షమార్హం కాదు!

01-09-1996